రోడ్లన్నీ గుంతలమయం

- వర్షం వస్తే గోతుల్లో నిండుతున్న నీరు
- మరమ్మతు పట్టించుకునే నాథుడే లేడు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

నారాయణపేట టౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని రోడ్లపై నీరు చేరి ప్రయాణం కష్టంగా మారింది. జిల్లా కేంద్రంలో ఇప్పటికే రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. చిన్నపాటి గుంతలు ఏర్పడినప్పుడే మరమ్మతు చేపట్టకపోవడంతో అవి పెద్దగా మారడంతో వర్షం నీరు నిల్వ ఉండడంతో కుంటలను తలపిస్తున్నాయి. పట్టణంలోని మున్సిపల్ రోడ్, సివిల్ లైన్, బస్టాండ్ రోడ్, యాద్గీర్ రోడ్, చిన్నపిల్లల ఆస్పత్రి రోడ్ ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయి. గుంతల్లో నీరు నిలవడంతో వాటిని అంచనా వేయలేక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

అంతర్గత రోడ్లు అంతంతే..

ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత దారులు సైతం పాడైపోయాయి. ఇటీవల కురిసిన తేలికపాటి వర్షాలకే రహదారులు చెరువులను తలపిస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వచ్చేది వర్షకాలం కావున పరిస్థితి అప్పుడు ఎలా ఉంటుందని వాపోతున్నారు. దీనిపై అధికారులు కనీసం స్పందించకపోవడం, మరమ్మతు చేయకపోవడంపై వాహనదారులు మండిపడుతున్నారు. గుంతలు ఇలానే ఉంటే వర్షాకాలంలో నీరు నిలిచి ప్రయాణం నరకంగా మారుతుందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గుంతలకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ చిన్న పిల్లల ఆస్పత్రి వద్ద నిలిచిన వర్షపు నీరు



సివిల్ లైన్ రోడ్డులో..

గోతులతో అవస్థలు..

పట్టణంలో రహదారులపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచిపోవడం వల్ల వాహనం నడిపించే సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు వాహనం అదుపు తప్పి గుంతల్లో పడతామోనని భయాందోళన మధ్య ప్రయాణం సాగించాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలి.

– సత్యనారాయణరెడ్డి, నారాయణపేట

మరమ్మతు చేయిస్తాం..

పట్టణంలో రహదారులపై ఏర్పడిన గుంతలను పరిశీలించి మరమ్మతు చేయడానికి కృషి చేస్తాం . రోడ్లపై వర్షపు నీరు నిల్వ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

సామూహిక అక్షరాభ్యాసం



మరికల్: మండలంలోని తీలేర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం సర్పంచ్ రేవతమ్మ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శిరీష, మహేంద్రమ్మ, నాయకులు తిమ్మరెడ్డి, భజరప్ప తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఊట్కూరు: మండలంలోని కొల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆకుకూరలు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. రక్తహీనతకు ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మణిమాల, మహేశ్వరి, ఉమాదేవి, సురేఖ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చెరువుల పండగను జయప్రదం చేయాలి

మరికల్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆనకట్టపై నిర్వహించే చెరువుల పండగలో అత్యధిక సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కార్యదర్శి శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. చెరువు కట్టపై ఉన్న కట్ట మైసమ్మకు పూజలు, బతుకమ్మ సంబరాలు చేస్తున్నందున గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా తరలిరావాలని సూచించారు. ఈ వేడుకలకు రైతులతో పాటు గ్రామస్తులు కూడా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కళాశాల ప్రవేశాల కోసం ఇంటింటి ప్రచారం

మద్దూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుధవారం మద్దూరు, దోరేపల్లి, దామరగిద్ద మండలంలోని మొగులమడ్క గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాల ప్రత్యేకతలను వివరించారు. ఉచిత అడ్మిషన్, స్కాలర్‌షిప్ సౌకర్యం, అధ్యాపక బృందం, విద్యార్థుల ఉత్తీర్ణత వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యూ. మద్దిలేటి, ఉపన్యాసకులు రాములు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్, విజయకాంత్, లక్ష్మిరెడ్డి, రమేష్, సంతునాయక్ పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోస్గి: సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని కొత్తపల్లిలో ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలు, సామాజిక అంశాలు, బాల్యవివాహాలు, చోరీలపై ప్రజలకు పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం ఇవ్వొద్దన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. షీ టీం , బాలిక హక్కుల చట్టాలను అవగాహన ఉండాలన్నారు. ఏదైన ప్రమాదం జరిగితే డయల్ 100 కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు సురేందర్ గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యా నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

నారాయణపేట రూరల్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉండి కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలోని పీఎస్‌లలో నమోదైన కేసులను పరిశీలించి సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు, కోర్టు డ్యూటీ అధికారులు చొరవ తీసుకుని వారికి అవగాహన కల్పించాలన్నారు. ఇరువురి అంగీకారంతో సమస్య పరిష్కారం అవుతుందని, విలువైన సమయం , డబ్బులు ఆదా అవుతాయన్నారు. ఈ నెల 10న లోక్ అదాలత్ జరుగుతుందని, ముందుగా వారు రాజీ చేసుకునేందుకు సంబంధిత పోలీసుల ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా ఇటీవల టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఎరుకల విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు రాములు, నర్సింహులు, గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 లోపు 88860 91850 నెంబర్‌కు కాల్ చేసి పేరు, వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ఆదివారం మధ్యాహ్నం బహుమతులు అందిస్తామన్నారు. ఆ లోపే విద్యార్థులు తమ నమోదు చేసుకోవాలని సూచించారు.

చెరువుల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి



తనిఖీ చేస్తున్న సీఈఓ జ్యోతి



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సత్యప్రకాష్

మక్తల్: చెరువుల ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ జ్యోతి అధికారులకు సూచించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ ఈ నెల 9న నిర్వహించే చెరువు పండుగ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 150 పైగా చెరువులు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ పావనీ, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఊరూర చెరువు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పెషల్ అధికారి సత్యప్రకాష్ అన్నారు. బుధవారం నేరడగం గ్రామ పంచాయతీ భవనంలో వివిధ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అధికారి ఆనంద్‌రావు, సర్పంచ్ అశోక్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నర్సప్ప, ఐకేపీ, అంగన్‌వాడీ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని 15 చెరువుల దగ్గర చెరువుల పండుగ కార్యక్రమం గురువారం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, మహిళ సంఘాలు, రైతులు, గ్రామస్తులు హాజరుకావాలని సూచించారు.

అంధకారంలో ఆత్మకూర్

ఆత్మకూర్: చిన్నపాటి వర్షం వచ్చిందంటే చాలు గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం పట్టణంలో సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే అధికారులు విద్యుత్ సరఫరను నిలిపేశారు. రాత్రి 10 గంటలైన విద్యుత్ సరఫరాను పునరుద్ధీకరించకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా విద్యుత్ సరఫరాలో అవంతరాయం గురించి తెలుసుకునేందుకు ఫోన్లు చేస్తే అధికారులందరూ సెల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడంపై స్థానికులు మండినడుతున్నారు.

ఇంటి పట్టాల కేటాయింపునకు సర్వే

అమరచింత: మండలంలోని నందిమళ్ల గ్రామంలో నిజమైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నామని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. డీటీ అనురాధ, ఆర్‌ఐ గోపాల్ ఆధ్వర్యంలో బుధవారం నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గతంలో ఇంటి స్థలాల కోసం దరఖాస్తు పెట్టుకున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకుంటున్నామని తెలిపారు. 1994లో గ్రామంలో నిరుపేదలకు ఇంటి స్థలాలను ఇవ్వడానికి ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసిందన్నారు. అప్పటి నుంచి పట్టాల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో మారోమారు లబ్ధిదారుల సేకరణతో పాటు లేఅవుట్ చేసి.. ప్లాట్లుగా విభజిస్తామని తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను కలెక్టర్‌కు త్వరలో నివేదిస్తున్నామన్నారు.

సంబరాలు కాదు.. మరమ్మతు చేయండి



ఆత్మకూర్‌లో ధ్వంసమైన జూరాల కాల్వను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: చెరువుల వద్ద సంబరాలు కాదు పూర్తిగా ధ్వంసమైన జూరాల కాల్వలకు మరమ్మతు చేయాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వినయ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూర్, అమరచింత మండలాల కాంగ్రెస్ నాయకులు జూరాల ప్రధాన ఎడుమకాల్వ, డీ 6 కాల్వలను పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే కాల్వలకు మరమ్మతు చేయాల్సి ఉండగా ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారనంగా రెండేళ్లుగా మరమ్మతు చేపట్టకపోవడంతో నీరు వృథా అవుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య ధోరణిని వ్యవహరిస్తోందని, 75 కిలోమీటర్ల మేర ఉన్న జూరాల కాల్వ దిక్కుమొక్కు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రుణాలను వెంటనే మాఫీ చేయాలని, అకాల వర్షాల కారనంగా నష్టపోయిన పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్‌గౌడ్, తులసిరాజ్, పరమేష్, శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, భగవంతు, గంగాధర్, బుచ్చన్న, రైతులు పాల్గొన్నారు.

మసీద్ కమిటీ ఉపాధ్యక్షుడి మృతికి సంతాపం

అమరచింత: పట్టణంలోని జామీయా మసీద్ కమిటీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల ఖదీర్ (48) ఆకస్మికంగా మృతి చెందడం తీరని లోటని అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. మజీద్ అభివృద్ధిలో చురుకుగా పాల్గొనే ఖదీర్ మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం కర్నూల్‌కు వెళ్లిన ఖదీర్ సాయంత్రం ఆత్మకూర్‌కు చేరుకున్నాడు. ఇంట్లోనే సాయంత్రం ఛాతిలో నొప్పి అంటూ ఒక్కసారిగా కుప్పకూలడంతో ఆయనను మహబూబ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. మృతి చెందిన ఖదీర్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రఫీక్, అన్వార్, తౌఫిక్, మైను, పాషా, ఖాసీం, అల్తాఫ్, ఆశు, నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ చొరవతో దర్గా మరమ్మతు

అమరచింత: పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై వెలసిన శ్రీసయ్యద్ షా రాజావళీ దర్గా మరమ్మతు పనులను తహసీల్దార్ చాంద్‌పాషా చొరవతో బుధవారం ప్రారంభించారు. 20 రోజుల కిందట వీచిన గాలివానకు చెరువు కట్టపై ఉన్న దర్గాపై భారీ చెట్టు విరిగిపడటంతో దర్గా వెనక భాగం దెబ్బతింది. చెరువుల పండుగ సందర్భంగా చెరువు పరిసరాలను పరిశీలించడానికి వచ్చిన తహసీల్దార్‌కు రాజావళీ దర్గా పెచ్చులూడి ఉండటం గమనించి వెంటనే తన సొంత డబ్బులతో దర్గా మరమ్మతు పనులు చేయడానికి సిద్ధమయ్యారు. తాపీమేస్త్రీలను పిలిపించి దర్గా మరమ్మతు పనులను చెపట్టాలని ఆదేశించడంతో నిర్మాణ పనులు మొదలయ్యాయి.



మరమ్మతు చేస్తున్న కార్మికులు

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం సస్యశ్యామలం



సాగునీటి రంగంలో సాధించిన ప్రగతిబుక్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం సస్యశ్యామలం అయిందని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలో బుధవారం నిర్వహించిన సాగునీటి దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాగునీటి రంగంలో సాధించిన ప్రగతి బుక్‌ను ఆవిష్కరించారు. రైతు సంతోషంగా ఉంటే దేశం సంతోషంగా ఉంటుందని భావించిన కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. వలసలు నివారించేందుకే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారన్నారు. బీజేపీ నాయకులు వేసిన కేసుల వల్లే పనులు ఆలస్యంగా కొనసాగాయన్నారు. కేసీఆర్ ముందుచూపుతో కర్వెన ప్రాజెక్ట్ నుంచి నారాయణ పేటకు నీటిని తరలించే కాల్వ ద్వారా కోయిల్ సాగర్ ప్రాజెక్ట్‌కు లింకును కలిపి ఊక చెట్టువాగు ద్వారా జూరాల ఆయకట్టు కింద రెండవ పంటకు నీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాడన్నారు. ఇప్పటికే నియోజక వర్గానికి అధిక చెక్‌డ్యాంలు మంజూరు చేశారన్నారు. 22 పూర్తి కాగా మరో 9 మంజూరయ్యాయన్నారు. దీంతో నియోజకవర్గంలో 1.40 లక్షల ఎకరాలు అధికంగా సాగు అయ్యిందన్నారు. ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వట్టెం రాజేశ్వరి, ఇరిగేషన్ ఈఈ ప్రతాప్‌సింగ్, డిప్యూటీ డీఈలు చందు నాయక్, గోపాలచారి, తహసీల్దార్ సువర్ణ రాజు, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న రమాణచారీ

మరికల్: వేంకటేశ్వరుడి కరుణా కటాక్షములు అందరికీ లభించాలని, కరోనా లాంటి మహమ్మారి నుంచి లోకాన్ని రక్షించేందుకు లోక కల్యాణం కోసం ఉచిత శ్రీనివాస కల్యాణాలను జరిపించాలని ప్రభుత్వ సాంస్కృతిక సలహదారులు రమాణాచారి అన్నారు. మరికల్‌లో బుధవారం సూర్యచంద్ర ఫంక్షన్‌హాల్‌లో లోక కల్యాణం కోసం నిర్వహించిన శ్రీనివాస కల్యాణం కనులపండవగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రభుత్వ సలహదారులు రమణాచారి పాల్గొని, వేడుకలను తిలకించారు. గ్రామాల్లో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భక్తి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా హిందూ దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. అలాగే బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కాంగ్రెస్ డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, దేవరి మల్లప్ప కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం సూర్య చంద్ర ఫౌండేషన్ తరఫున ముఖ్య వక్తలను సన్మానించారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న నాగురావు నామాజీ

నారాయణపేట టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆదివారం నారాయణపేటకు చేరుకున్న 14వ వార్డుకు చెందిన వారిని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు నాగురావు నామాజీ బుధవారం పరామర్శించారు. 14వ వార్డుకు చెందిన బండి రాజు, అన్నమయ్యగౌడ్, కుమ్మరి ఆశప్ప, విశ్వనాథ్, కృష్ణయ్య, రాములు, వెంటకయ్యగౌడ్ పది మంది అయోధ్య రామమందిరాన్ని తిలకించేందుకు వెళ్లారు. అయితే 10 రోజుల క్రితం లక్నో సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండేకు సమాచారం ఇవ్వడంతో ఆయన చొరవతో మెరుగైన వైద్యం అందించారని బాధితులు తెలిపారు. కార్యక్రమంలో సిద్ది వెంకట్రాములు, శ్యామ్‌సుందర్‌గౌడ్, అప్పిరెడ్డిపల్లి రాము ఉన్నారు.

ఎల్‌ఎన్‌టీ ఆధ్వర్యంలో ‘హరితహారం’



మొక్కలు నాటుతున్న ఎల్‌ఎన్‌టీ సిబ్బంది

ఊట్కూరు: మండల కేంద్రంలోని ఎల్‌ఎన్‌టీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ దినోత్సవం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊట్కూరు, పులిమామిడి, తిప్పరాస్‌పల్లి, చిన్నపొర్ల, మల్లెపల్లి తదితర గ్రామాలలో రోడ్డుకు ఇరువైపులా, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు ప్రతి ఇంటి దగ్గర ఐదు మొక్కలు నాటాలని ఎల్‌ఎన్‌టీ సిబ్బంది కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఎన్‌టీ సిబ్బంది అధికారులు ఈశ్వర్, రవిశంకర్, భూమేష్, ప్రదీప్‌కుమార్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కోటకొండను మండలంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహార దీక్షలు 29వ రోజుకు చేరుకున్నాయి. బుధవారం పద్మశాలీ సంఘం సభ్యులు దీక్షలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు, పద్మశాలి సంఘం నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ.. కోటకొండను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు కలిగి ఉన్నా రాజకీయ దురుద్దేశంతోనే టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. స్థానిక నాయకులు, ఈ ప్రాంత ఎమ్మెల్యే చొరవ తీసుకుని సీఎం కేసీఆర్‌తో ప్రకటన ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, రాము, కాశీనాథ్, బలరాం, నర్సింహులు, చెన్నప్ప, సంఘం సభ్యులు కెంచె శ్రీనివాసులు, బోగం భాస్కర్, ప్రవీణ్, రాములు, మార్కండేయ, అంబదాస్, గోవింద్, కుర్మయ్య, అశోక్, కృష్ణ, నారాయణ, బాలప్ప, నాగరాజు, రాజు, వెంకట్రాములు, సోమయ్య పాల్గొన్నారు.

ప్రజాధనం ఖర్చు చేసి ఉత్సవాలా?



ప్రచారం చేస్తున్న ప్రజాపంథా నాయకులు

అమరచింత: ప్రజాధనంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరుతో అభివృద్ధి పథకాలు తమ పార్టీ సాధించిన గొప్ప విజయంగా ప్రచారం చేసుకోవడం ఏంటని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి హనుమంతు ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలంటూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తుందని దుయ్యబట్టారు. పట్టణంలో బుధవారం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆరోపించారు. రూ.ఐదు లక్షల కోట్ల అప్పులను ప్రజల నెత్తిన మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు వ్యవస్థ ఉండదని చెప్పిన సీఎం కేసీఆర్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడంలో విఫలమయ్యాడని మండిపడ్డారు. డబుల్ బెడ్‌రూంలు ఇవ్వడంలో ప్రజలను మోసం చేశారన్నారు.

ఊసే లేని రైతు రుణమాఫీ..

రైతులకు రుణమాఫీ చేయకుండా రైతాంగాన్ని మోసం చేశాడని, పోడు భూములకు పట్టాలిస్తానని చెప్పి కాలయాపన చేస్తూ ప్రజల్ని మభ్యపెడుతూనే ఉన్నారని విమర్శించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను ఇవ్వలేక పోయారని, ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్తారని జోస్యం చెప్పారు. బంగారు తెలంగాణ అంటూ అందినంత దోచుకోవడమే పనిగా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పనిగా మారిందన్నారు. దీక్ష దివస్ సందర్భంగా ఈనెల 8న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, 12న జిల్లా కేంద్రంలో దీక్ష దివస్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి రాజు, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న, బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సామేలు, నాయకులు వెంకటేష్, రాజు, మురళి, జనార్ధనమ్మ, శైలజ, మహేశ్వరమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



మాగనూరులో బడి ఈడు పిల్లలతో ఉపాధ్యాయులు

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ మధుకర్ రావు అన్నారు. బుధవారం గుండుమాల్ మండల కేంద్రంలోని సీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. అదేవిధంగా హన్మాన్‌పల్లిలో పాఠశాల ఉపాధ్యాయుడు నర్సిములు ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రకాష్ గౌడ్, నర్సిములు, సీఆర్పీ దస్తయ్య పలువురు పాల్గొన్నారు.

మాగనూర్: బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎఫ్‌ఎల్‌ఎన్‌లో భాగంగా బడి ఈడు పిల్లల గుర్తింపు ప్రత్యేక సర్వే ఉపాధ్యాయులతో కలిసి చేపట్టారు. ఇంటింటికి తిరిగి బడిబయట పిల్లలను గుర్తించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఉపాధ్యాయులు నరేందర్, రమేష్, సీఆర్పీలు కృష్ణ, ఎల్లాగౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో..



లింగారెడ్డిపల్లిలో చిన్నారులతో ఉపాధ్యాయులు

బడిఈడు పిల్లల పాఠశాలలో చేరిక..

దామరగిద్ద: బడిఈడు కలిగిన చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలని హెచ్‌ఎం రమేష్, సీఆర్పీ ఉషనప్ప అన్నారు. బుధవారం మండలంలోని లింగారెడ్డిపల్లిలో ఇంటింటికీ తిరిగి బడిఈడు కలిగిన చిన్నారులను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, దస్తులు, మధ్యాహ్న భోజనంతో పాటు అనుభవం గల ఉపాధ్యాయులతో విద్య అందిస్తున్నట్లు తెలిపారు.